ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి



గంగాధర: మండలంలోని మల్లాపూర్ ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు గురువారం ముందస్తు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. మల్లాపూర్, నడింపల్లి, గోపాల్‌రావుపల్లి, మల్కాపూర్ గ్రామాల్లో ర్యాలీ తీశారు. ప్రభుత్వ పాఠశాలల్లోని వసతులు, బోధనకు సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేశారు. తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని పిలుపునిచ్చారు. శుక్రవారం పాఠశాలలో నిర్వహించే సరస్వతి పూజ, అక్షరభ్యాస కార్యక్రమానికి విద్యార్థులందరూ హాజరు కావాలని పిలుపునిచ్చారు.



దొడ్డి కొమురయ్యకు నివాళి

చొప్పదండి: పట్టణంలో కుర్మ యువజన సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య జయంతి నిర్వహించారు. అధ్యక్షుడు జిట్ట కుమార్ కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో రాజు, మునేశ్, రాజశేఖర్, గుంటి బీరయ్య, కచ్చు మల్లయ్య, బండారి అనిల్, జిట్ట నాగార్జున, బండారి సతీశ్, తదితరులు పాల్గొన్నారు.



గంగాధర: మండలంలోని మధురానగర్ పంచాయతీ పరిధి ఐదో వార్డులో డ్రైనేజీ లేక పోవడంతో రోడ్డుపైకి మురుగునీరు చేరి దుర్వాసన వస్తోంది. రోడ్డు పక్కన మురుగు నిలవడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయని, రోగాలబారిన పడుతున్నామని వార్డులో మురుగు కాలువల నిర్మాణం చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు. సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కావడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
రాము, ఎంపీడీవో, గంగాధర సెల్ నంబర్: 92814 82645

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

క్లుప్తంగా

పాఠశాలల్లోని వసతులు వినియోగించుకోవాలి



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న సీఐ లక్ష్మీనారాయణ, తదితరులు

మానకొండూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో పీఎంశ్రీ నిధులతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఎంఈవో మధుసూదనాచారి, సీఐ లక్ష్మీనారాయణ గురువారం ప్రారంభించారు. అనంతరం కొత్తగా వచ్చిన పది కంప్యూటర్లను ప్రారంభించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉన్నతంగా ఎదగాలని సూచించారు. పిల్లలు చెడు అలవాట్లకు బానిస కావొద్దని, టీచర్లు చెప్పిన పాఠాలు వింటూ శ్రద్ధగా చదువుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి, సంక్షేమం



దొంత సుధాకర్

సైదాపూర్: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని కాంగ్రెస్ పార్టీ సైదాపూర్ మండల అధ్యక్షుడు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దొంత సుధాకర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో మాట్లాడారు. పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం పేదవాళ్లకు ఇళ్లు కట్టివ్వలేదని, వెన్కెపల్లిని పైలట్ గ్రామంగా ఎంపిక చేసి ఒక్క గ్రామానికే 250 ఇళ్లు మంజూరు చేసిన ఘనత మంత్రి పొన్నం ప్రభాకర్‌కే దక్కిందన్నారు. పాత ఇళ్లు కూల్చి కొత్త ఇళ్లు కట్టుకుంటున్నారని, పని దొరక్క పట్టణాలకు వలస పోయిన కూలీలు తిరిగి వెన్కెపల్లికి వస్తున్నారని, కొందరు బీఆర్ఎస్ నాయకులు ఇళ్లు కట్టుకుంటున్న వారికి బిల్లులు రావని, అసత్య ప్రచారం చేస్తున్నారని, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు నిరంతర ప్రక్రియ అని, అన్ని గ్రామాల్లో అర్హులకు ఇళ్లు మంజూరవుతాయన్నారు. బీఆర్ఎస్ నాయకులు అధికారంలో ఉన్నప్పుడూ, లేనప్పుడు అబద్ధాలతోనే బతుకుతున్నారని ఆరోపించారు. ఆరు గ్యారంటీలు అమలవుతుంటే విమర్శలు చేయడం బాధాకరమన్నారు.

న్యూట్రిషన్ కిట్స్ అందజేత



న్యూట్రిషన్ కిట్స్ అందజేస్తున్న తులసీదాస్

ఇల్లందకుంట: కరీంనగర్ జిల్లా క్షయ నియంత్రణ సంస్థ, జమ్మికుంట టీబీ యూనిట్ ఆధ్వర్యంలో ఇల్లందకుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి గ్రామాల్లోని క్షయ వ్యాధిగ్రస్తులకు గురువారం న్యూట్రిషన్ కిట్స్ అందించారు. నిక్షయ్ పోషణ్ యోజన పథకంలో భాగంగా పోషకాహారం నిమిత్తం నెలకు రూ.వెయ్యితోపాటు కిట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో డా తులసిదాస్, కళ్యాణ్, సీహెచ్‌వో శ్యామల, సూపర్‌వైజర్ శ్రీనివాస్, టీబీ సూపర్‌వైజర్ దేవేందర్‌రెడ్డి, మానస, తిరుపతి ఉన్నారు.

నాయకుల పరామర్శ

గంగాధర: మండలంలోని కురిక్యాల గ్రామానికి చెందిన కౌలు రైతు ఒగ్గరి ప్రశాంత్ మూడు రోజుల క్రితం విద్యుత్‌షాక్‌తో మృతి చెందాడు. మృతుడి కుటుంబాన్ని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం గురువారం పరామర్శించారు. రూ.పదివేలు అందించి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

కౌలు రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి

ప్రశాంత్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ జాతీయ కౌన్సిల్ మెంబర్ బొడిగె శోభ డిమాండ్ చేశారు. గురువారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. విద్యుత్‌శాఖ నిర్లక్ష్యంతోనే కౌలు రైతు మృతి చెందాడని, శాఖ తరుపున ఆర్థిక సాయం అందించాలని, మృతుడి భార్యకు అంగన్‌వాడీ టీచర్ పోస్టు ఇప్పించాలన్నారు.

మున్సిపల్ కమిషనర్లకు అవార్డులు



ప్రశంసా పత్రం అందుకుంటున్న నాగరాజు



అవార్డు అందుకుంటున్న ఎండీ అయాజ్

చొప్పదండి: గత ఆర్థిక సంవత్సరంలో ఆస్తిపన్ను వసూలు చేయడంలో రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచినందుకు చొప్పదండి మున్సిపల్ కమిషనర్ కీర్తి నాగరాజు గురువారం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్నారు. మార్చి నెలాఖరు వరకు 84.10 శాతం పన్నులు వసూలు చేసినందుకు ఆయనను రాష్ట్ర అధికారులు సన్మానించి అభినందించారు. ఈసందర్భంగా నాగరాజు మాట్లాడుతూ... పన్నుల వసూలుకు సహకరించిన గృహ, వాణిజ్య, రైస్‌మిల్లు యజమానులకు, మున్సిపల్ మేనేజర్ ప్రశాంత్ కుమార్, ఇతర అధికారులు, సిబ్బంది, వార్డు అధికారులు, బిల్ కలెక్టర్, కంప్యూటర్ ఆపరేటర్లకు కృతజ్ఞతలు తెలిపారు.

జమ్మికుంట: హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో గురువారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి కమిషనర్ల ప్రత్యేక సమావేశంలో జమ్మికుంట మున్సిపల్ కమిషనర్ ఎండీ అయాజ్ ఉత్తమ కమిషనర్ అవార్డు, ప్రశంస పత్రం గురువారం అందుకున్నారు. ఆస్తి పన్నుల వసూలులో రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిపినందుకు సీడీఎంఏ శ్రీదేవి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా అయాజ్ మాట్లాడుతూ.. జమ్మికుంట మున్సిపల్ అధికారులు, సిబ్బంది, ప్రజలు, ప్రజాప్రతినిధుల సహకారంతోనే అవార్డు అందుకున్నానని , సహకరించిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

డిగ్రీ విద్యార్థులకు 'మధ్యాహ్న భోజనం'



భోజనం వడ్డిస్తున్న దాతలు, ప్రిన్సిపల్, అధ్యాపకులు

జమ్మికుంట: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వసతి కల్పించడం అభినందనీయమని రాష్ట్ర కళాశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్లు ప్రొ.యాదగిరి, ప్రొ.రాజేందర్ సింగ్, ఏజీవో బాల భాస్కర్ అన్నారు. గురువారం కళాశాలలో ప్రిన్సిపల్ బి.రమేశ్ అధ్యక్షతన మధ్యాహ్న భోజన వసతిని పూర్వ విద్యార్థులు, కాటన్ మిల్లు అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బచ్చు భాస్కర్, జిల్లా అధ్యక్షుడు దొనకొండ మల్లారెడ్డి సహకారంతో జాయింట్ డైరెక్టర్లు వర్చువల్‌గా ప్రారంభించారు. కళాశాలలో చదువుకునే గ్రామీణ ప్రాంత విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించడం వల్ల చదువులో మెరుగైన ఫలితాలను సాధించవచ్చొన్నారు. విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఉద్యోగ, పోటీ పరీక్షలు, కేంద్రీయ, రాష్ట్రీయ విశ్వ విద్యాలయాల్లో పీజీ సీట్లు సాధించాలని సూచించారు. అనంతరం దాతలకు పుష్పగుచ్చం అందజేసి, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డా.ఓదెల్ కుమార్, అధ్యాపకులు రాజేంద్రం, గణేశ్, శ్యామల, మాధవి, కిరణ్‌కుమార్, రాజకుమార్, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజ్యాంగ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడొద్దు



హుజూరాబాద్: ప్రచారం చేస్తున్న నాయకులు



సైదాపూర్: దుద్దెనపల్లిలో నాయకుల ర్యాలీ



ఇల్లందకుంట: నాయకుల పాదయాత్ర

హుజూరాబాద్: మండలంలోని వెంకట్రామ్‌పల్లె గ్రామంలో ఏఐసీసీ పిలుపు మేరకు కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ ఆదేశాలతో మండలంలోని కాంగ్రెస్ నాయకులు వెంకట్రామ్‌పల్లె గ్రామంలో జై బాపు జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా భారత రాజ్యాంగాన్ని పరిరక్షించాలంటూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పత్తి కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. రాజ్యాంగాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అపహాస్యం చేస్తోందని, రాజ్యాంగ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతోందని, సరైన సమయంలో ప్రజలే గుణపాఠం చెబుతున్నారని పేర్కొన్నారు.

సైదాపూర్: రాజ్యాంగాన్ని మతతత్వ శక్తుల నుంచి కాపాడుకుందామని కాంగ్రెస్ సైదాపూర్ మండల అధ్యక్షుడు, ఏఎంసీ చైర్మన్ దొంత సుధాకర్ అన్నారు. మండలంలోని దుద్దెనపల్లి, ఎగ్లాస్‌పూర్, సోమారం, గర్రెపల్లి, బూడిదపల్లి,లస్మన్నపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. దేశ ప్రజలకు సమాన హక్కులు, సమన్యాయం, కల్పించాల్సిన నాయకులు స్వేచ్ఛను కాలరాస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు గుండారపు శ్రీనివాస్, మిట్టపల్లి కిష్టయ్య, మ్యాకల రవీందర్, లంకదాసరి మల్లయ్య, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు బానోత్ కిషన్‌నాయక్, బొమ్మగాని రాజు, నవీన్, విద్యాన్ రెడ్డి, రాజ్‌కుమార్, గద్దం శేకర్,మీస భీరయ్య, సాయికుమార్, క్రాంతికుమార్, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

ఇల్లందకుంట: మండలంలోని కనగర్తి నుంచి లక్ష్మాజీపల్లి వరకు రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర కాంగ్రెస్ ఇల్లందకుంట మండల అధ్యక్షుడు పెద్ది కుమార్ ఆధ్వర్యంలో చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ.. అహింస పద్ధతిలో దేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చిన గాంధీజీ ప్రపంచానికి ఆదర్శంగా నిలిచాడని, ప్రజలకు స్వేచ్ఛ సమానత్వం కోసం రాజ్యాంగం రచించిన అంబేద్కర్‌ను బీజేపీ, ఆర్ఎస్ఎస్ అవమానిస్తున్నాయని మండిపడ్డారు. పాదయాత్ర ద్వారా రాజ్యాంగం గొప్పతనం ప్రజలకు తెలియజేయడంతో పాటు మహనీయులను స్మరించేందుకు వారి సేవలను నేటి తరానికి తెలియజేయాలనే ఉద్దేశంతో బృహత్తర కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. నాయకులు సారంగ పాణి, ప్రవీణ్, మిట్ట మోహన్‌రావు, మల్లయ్య, రాజు, మల్లేష్, శ్రీని వాస్‌రెడ్డి, ఓదెలు, వీరారెడ్డి, వెంకటేష్, మల్లారెడ్డి, రజిత, మానస, రవి, సాయి, మహేష్, సదానందం, స్వామి పాల్గొన్నారు.

చామనపల్లి పీహెచ్‌సీలో నార్మల్ డెలివరీ

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం చామనపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ఓ గర్భిణికి సాధారణ ప్రసవం చేశారు. మొగ్దుంపూర్‌లోని ఇటుకబట్టీల్లో పనిచేస్తున్న ఒడిస్సా రాష్ట్రానికి చెందిన వలస కూలీ భాగ్‌బతి(25)కి పురిటినొప్పులు రావడంతో పీహెచ్‌సీలో చేర్పించారు. మధ్యాహ్నం 2గంటలకు పీహెచ్‌సీ వైద్యుడు మనోహర్ ఆధ్వర్యంలో స్టాఫ్‌నర్స్‌లు శైలజ, లక్ష్మి, విమలతో పాటు వైద్య సిబ్బంది సాధారణ ప్రసవం చేయగా తొలికాన్పులో బాబు పుట్టాడు. తల్లిబిడ్డలు ఆరోగ్యంగా ఉన్నారని పీహెచ్‌సీ వైద్యుడు మనోహర్ తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పీహెచ్‌సీలో డెలివరీ కేసులు చేపడుతున్నామని, ఇప్పటివరకు ఇద్దరు గర్భిణులకు సాధారణ ప్రసవం చేసినట్లు వివరించారు. వైద్యసిబ్బందిని కాంగ్రెస్ పార్టీ నాయకుడు బుర్ర గంగయ్యగౌడ్ అభినందించి స్వీట్లు పంపిణీ చేశారు.

శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం



పూజలు చేస్తున్న వెంకటేశ్వర్‌రావు

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామంలో గురువారం శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలతో పాటు హోమం తదితర కార్యక్రమాలను వేద పండితులు నిర్వహించారు. కాగా కార్యక్రమంలో రామడుగు సింగిల్ విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వర్‌రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంట్ల జితేందర్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పూడురి మణెమ్మమల్లేశం, కొండగట్టు దేవస్థానం మాజీ డైరెక్టర్ దాసరి రాజేందర్‌రెడ్డి, పైండ్ల శ్రీనివాస్ పలువురు పాల్గొన్నారు.

నాటుసారా తయారీ, విక్రయిస్తే చర్యలు



మల్లారెడ్డిపల్లిలో నాటుసారా స్వాధీనం చేసుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

వీణవంక: నాటుసారా తయారీ, విక్రయిస్తే చర్యలు తప్పవని ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ నాగేశ్వర్‌రావు హెచ్చరించారు. కరీంనగర్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రావు ఆదేశాల మేరకు మండలంలోని మల్లారెడ్డిపల్లి గ్రామంలో గుడుంబా తయారీస్థావరంపై సీఐ ఆధ్వర్యంలో దాడులు చేశారు. పది లీటర్ల నాటుసారాతో పాటు 200 లీటర్ల బెల్లం పానకం, ఇతర సామగ్రిని ధ్వంసం చేశామని, వ్యక్తిపై కేసు నమోదు చేశామన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ మోసిన్, కానిస్టేబుళ్లు కుమార్‌యాదవ్, కమలాకర్, సంతోష్, సాయి, కాసింబి తదితరులున్నారు.

ముందస్తు అరెస్ట్

ఇల్లందకుంట: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను కాపాడాలని విద్యార్థులు నిరసన తెలుపుతుంటే పోలీసులు లాఠీచార్జ్ చేయడాన్ని నిరసిస్తూ ఏఐఎస్ఎఫ్, వామపక్ష విద్యార్థి సంఘాలు చలో సెక్రటేరియట్‌కు పిలుపునిచ్చాయి. గురువారం తెల్లవారుజామున ఏఐఎస్ఎఫ్ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు మాదరపు రత్నాకర్ కార్యక్రమానికి వెళ్లకుండా పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు.

'కూల్‌డ్రింక్స్ మానేద్దాం.. సహజపానీయాలు సేవిద్దాం'



కలెక్టరేట్ ఆవరణలో కరపత్రం ఆవిష్కరిస్తున్న జన విజ్ఞాన వేదిక నాయకులు

కరీంనగర్‌టౌన్: జనవిజ్ఞాన వేదిక కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో 'కూల్ డ్రింక్స్ మానేద్దాం.. సహజపానీయాలు సేవిద్దాం' నినాదంతో ముద్రించిన కరపత్రాలను గురువారం కలెక్టరేట్ ఆవరణలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కూల్‌డ్రింగ్‌తో కలిగే అనర్థాలను రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు కేశవరెడ్డి వివరించారు. వేసవి కాలంలో ప్రజలు రసాయనాలతో తయారుచేసిన కూల్‌డ్రింక్స్ తాగకూడదని, వీటివల్ల అనేక అనారోగ్య సమస్యలు వస్తాయని తెలిపారు. సహజపానీయాలైన పండ్లరసాలు, చెరుకు రసం, నిమ్మరసం, కొబ్బరి నీళ్లు తాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యవస్థాపకుడు సి. రామరాజు, జిల్లా బాధ్యులు దేవేందర్, వెంకటేశ్వర్‌రావు, రాష్ట్ర కమిటీ సభ్యులు సంపతి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల దృష్టి మరల్చేందుకే ప్రచారం



మాట్లాడుతున్న బింగి కరుణాకర్, నాయకులు

హుజూరాబాద్: ఇచ్చిన హామీలపై ప్రజల దృష్టి మరల్చేందుకే కాంగ్రెస్ నాయకులు భారత రాజ్యాంగాన్ని రక్షించాలంటూ ప్రచారం చేయడం విడ్డూరంగా ఉందని బీజేపీ జిల్లా కార్యదర్శి బింగి కరుణాకర్ అన్నారు. గురువారం మండలంలోని పోతిరెడ్డిపేట గ్రామంలో బీజేపీ మండల అధ్యక్షుడు రాముల కుమార్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రాజ్యాంగాన్ని రచించిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఫొటోను కాదని రాజ్యాంగంతో ఏ సంబంధం లేని మహాత్మా గాంధీ ఫొటోతో ప్రచారం చేస్తున్నారని, కాంగ్రెస్ నాయకులు అంబేద్కర్‌ను అవమానపరిచేలా వ్యవహరిస్తున్నారని, ఎన్నికల సమయంలో ఆచరణకు సాధ్యం కానీ హామీలిచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక అమలు చేయటంలో పూర్తిగా విఫలమైందన్నారు. సమావేశంలో నాయకులు బైరెడ్డి సంపత్‌రెడ్డి, ముప్పు మహేష్, మర్రి రవిందర్, నరెడ్ల చైతన్య రెడ్డి, మండల సాయిబాబా, పోచంపల్లి సహదేవ్, రావుల పూర్ణచందర్ తదితరులున్నారు.

రేషన్ షాపుల్లో సీఎం, పీఎం ఫొటోలు పెట్టాలి



మాట్లాడుతున్న రమణారెడ్డి, నాయకులు

ఇల్లందకుంట: మండలంలోని రేషన్ దుకాణాల్లో సీఎం రేవంత్‌రెడ్డి, పీఎం నరేంద్ర మోదీ ఫొటోలు పెట్టాలని బీజేపీ మండల అధ్యక్షుడు బైరెడ్డి రమణారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని కనగర్తిలో రేషన్ దుకాణాన్ని గురువారం సందర్శించారు. కేంద్ర ప్రభుత్వం గరీబ్ కళ్యాణ్ అన్న యోజన పథకం కింద రేషన్ కార్డుదారులకు ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం సొంత కార్యక్రమంగా చెప్పుకుంటుందని ఏద్దేవా చేశారు. కరోనా సమయం నుంచి దేశ ప్రజలకు ఉచిత రేషన్‌బియ్యం అందిస్తుంటే మోదీ చిత్రపటం రేషన్‌షాపులలో పెట్టకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో నాయకులు అబ్బిడి తిరుపతిరెడ్డి, మట్ట పవన్‌రెడ్డి, కొక్కుల దేవేందర్, ఉప్పుల శ్రీనివాస్‌రెడ్డి, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జోరుగా పైరవీలు

తిమ్మాపూర్: ఎల్ఎండీ ఎస్సైగా అభిలాశ్ దాదాపు ఖరారైనట్లు సమాచారం. ప్రస్తుత ఎస్సై వివేక్ బదిలీ అవుతారని మండలంలో జోరుగా చర్చ జరుగుతోంది. సిద్దిపేట జిల్లా కోహెడ ఎస్సైగా పనిచేస్తున్న అభిలాశ్‌ను ఎల్ఎండీకి తీసుకురావడానికి కొంతమంది ప్రయత్నిస్తున్నారని తెలిసింది. మొన్నటివరకు కరీంనగర్ సీపీగా ఉన్న అభిషేక్ మహంతి రాజకీయ పైరవీలకు తావివ్వకపోవడంతో ఎస్సైలు సైలెంట్‌గా ఉండిపోయారు. మహంతీ బదిలీ కావడంతో కోరుకున్న ఠాణాల కోసం ఎస్సైలు జోరుగా పైరవీలు చేస్తున్నారు.

చాలా మందికి ఆసక్తి

ఎల్ఎండీ ఠాణా కరీంనగర్ కమిషనరేట్‌లో మంచి ఆదాయం ఉన్న పోలీసు స్టేషన్ అని ప్రచారం. దీంతో చాలామంది ఇక్కడ ఎస్సైగా పనిచేయాలని ఆసక్తి చూపుతారు. ఇక్కడికి రావడానికి చాలా మంది పైరవీలు చేస్తారు. బీఆర్ఎస్ హయాంలోనే ఎల్ఎండీ ఎస్సైగా అభిలాశ్ వస్తారనే ఊహాగానాలు వినిపించాయి. అప్పుడున్న సీపీ అవకాశం ఇవ్వలేదు. కాంగ్రెస్ అధికారంలోకి రావడం కీలక నాయకులు సైతం అభిలాశ్‌ను తీసుకురావడానికి సుముఖత చూపినట్లు మండలంలో కొన్ని నెలలుగా చర్చ జరుగుతోంది. అయితే సీపీ మహంతి సమయంలో సిఫారసు లేఖలు, పైరవీలు పనిచేయకపోవడంతో ఎస్సైలు పోస్టింగ్ కోసం ప్రయత్నాలు చేయలేదు. కొత్త సీపీ రాకతో ఆశావహులు పైరవీలకు తెరలేపారు. ఎమ్మెల్యేలు కూడా తమకు అనుకూలంగా ఉండే వారి కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఇటీవల కమిషనరేట్ వ్యాప్తంగా జరిగిన బదిలీలే దీనికి నిదర్శనం. ఎల్ఎండీ ఎస్సైగా అభిలాశ్ వస్తాడనే చర్చ పోలీస్ శాఖలోనే కాకుండా మండలంలో సైతం ప్రధానంగా వినిపిస్తోంది. ఇదిలా ఉంటే ఎల్ఎండీలో పోస్టింగ్ కోసం మరికొంతమంది ఎస్సై సైతం పైరవీలు జోరుగా చేస్తున్నట్లు తెలుస్తోంది. కేవలం ఎల్ఎండీ పోలీస్ స్టేషన్ కాకుండా నియోజకవర్గంలోని ఇతర ఎస్సై, సీఐ పోస్టుల కోసం ప్రజాప్రతినిధులను ఆశ్రయిస్తున్నట్టు సమాచారం.

సన్నబియ్యం పంపిణీ



జమ్మికుంట: బియ్యం పంపిణీ చేస్తున్న నాగరాజు

శంకరపట్నం: మండలంలోని అంబేడ్కర్‌నగర్‌లో గురువారం సన్నబియ్యం పంపిణీని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బస్వయ్య గురువారం ప్రారంభించారు. ఈకార్యక్రమంలో శనిగరపు అంజి,సాగర్, మహేందర్‌రెడ్డి, మల్లయ్య, అంకూష్, కొమురయ్య,అజయ్, వెంకటేశ్‌లు పాల్గొన్నారు.

జమ్మికుంట: మండలంలోని మాచనపల్లి గ్రామంలో యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పర్లపల్లి నాగరాజు పేదలకు సన్న బియ్యం పంపిణీ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షాన పాలన సాగిస్తోందన్నారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు వేల్పుల ప్రశాంత్, రవీందర్‌రావు, సత్యనారాయణ, సందీప్, తిరుపతి, నాగరాజు, సంపత్ లబ్ధిదారులు పాల్గొన్నారు. మండలంలోని నగురం, నాగారం గ్రామాల్లో జై బాపు, జైభీమ్, జై సంవిధాన్ రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర మండల అధ్యక్షుడు పర్శరామ్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించారు.

ప్రొటోకాల్ పాటించాలి

గన్నేరువరం: ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రొటోకాల్ పాటించాలని బీఆర్ఎస్ గన్నేరువరం మండల అధ్యక్షుడు గంప వెంకన్న గురువారం ప్రకటనలో కోరారు. సన్నబియ్యం పంపిణీలో కొందరు ప్రొటోకాల్ పాటించడం లేదని, గ్రామాల్లో సీసీరోడ్డు పనులను అధికారులు పర్యవేక్షించాలన్నారు.